## ః “ సుందరకాండ పఠనం ” – శ్రీ అన్నమాచార్య సంకీర్తన – 13.05.2021 ః

**01.** పల్లవి :
వీడే నెలకొన్నాడు శ్రీ వేంకటగిరి మీద ।
వీడే కౌరవుల పాలిటికి విశ్వరూపుడితడు ॥ ॥ వీడే ॥

**02.** చరణం :
త్రిపురంబులమై వ్రాలిన ఆ ఘన తీవ్ర బాణమితడు ।
చపలపు బాణుని మర్మభేదియగు చక్రధరుడు ఇతడు ।
విపరీతము కంబములో వెలసిన వీరసింహమితడు ।
కపటపు భస్మాసురుని పాలిటికి కాలదండమితడు ॥ ॥ వీడే ॥

**03.** చరణం :
ధరణి క్రింద బలినణచిన ఆ పాతాళ భేదియితడు ।
పరశురాముని గర్వము నణచిన ప్రళయవాయువితడు ।
ఒరసిన నరకాసురునిపాలిటికి ఉరుమని పిడుగితడు ।
దురమున నెదిరిన దనుజ కోటులకు ధూమకేతువితడు ॥ ॥ వీడే ॥

**04.** చరణం :
అదిగో విధి రుద్రాదులకెల్లను ఆదిమూలమితడు ।
పదిలముగా తనుకొలిచిన ఆశ్రిత పారిజాతమితడు ।
కదలని ఆ బ్రహ్మాండకోటులకు కన్నతండ్రి యితడు ।
వెతకి వెతకి వరములొసంగెడి వేంకటపతి యితడు ॥ ॥ వీడే ॥

\- - -